

నేడు 'సుపరిపాలన' సమావేశం

పార్వతీపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు పేరిట ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరుకానున్నారు. అలాగే, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డితో పాటు పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు, ఇతర అధికారులు హాజరుకానున్నారు.

దైన్యం.. పశువైద్యం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- శిథిలావస్థలో భవనాలు
- మూగజీవాలకు అందని వైద్య సేవలు
- ఇబ్బందుల్లో పాడి రైతులు
- నేడు మంత్రి అచ్చెన్న రాక

పార్వతీపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువైద్యం మెరుగుపడడం లేదు. మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఒకపక్క పశువైద్య సిబ్బంది కొరత.. మరోపక్క ఆస్పత్రుల్లో సరిపడ వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. కొన్నేళ్లుగా ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదు. పశు వైద్యశాలలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల వైద్యులు లేక ఇన్‌చార్జిలే సేవలందిస్తున్నారు. దీంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం సంచార పశు వైద్యశాలలు పేరు చెప్పి.. ఉన్న సేవలను నిర్లక్ష్యం చేసింది. గ్రామీణ పశు వైద్యసేవలను పశు సంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలతోనే గడిపేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే పాడి రైతులు ఆశలు పెట్టుకున్నారు. శుక్రవారం వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాకు వస్తున్నారు. జిల్లాలో పశువైద్యం మెరుగునకు ఆయన ఎలాంటి హామీ ఇస్తారోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



పార్వతీపురం మండలం ఎంఆర్‌నగరం పశువైద్యశాలలో ఆవుదూడకు చికిత్స అందిస్తున్న వైద్యుడు (ఫైల్)

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 38 పశువైద్యాధికారులు ఉండాలి. కానీ, 18 మందే ఉన్నారు. 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గరుగుబిల్లి, బగ్గందొరవలస, తుమరాడ, విశ్వనాథపురం, భామిని, బత్తిలి, తాళ్లబురిడి, మాదలంగి, గంగిరేగివలస, చిలకలపల్లి, సంబర, గుమ్మ, భద్రగిరి, ఎం.సింగుపురం, బిటివాడ, పూడి తదితర ప్రాంతాల్లో పశువైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీతంపేట మండలానికి చెందిన పశువైద్యాధికారులు సంతోష్, శంకరరావు భామిని మండలానికి ఇన్‌చార్జిలుగా ఉన్నారు. రెండు మండలాలకు వీరే దిక్కు కావడంతో పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. పాలకొండ మండలం చిన్నమంగళాపురం పశువైద్య కేంద్రం వైద్యాధికారిగా సిద్ధార్థ విధులు నిర్వహిస్తున్నారు. మండలం మొత్తానికి ఆయన ఒక్కరే సేవలు అందిస్తున్నారు. ఆయనకు శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం బదిలీ జరిగింది. ఆయన కూడా వెళ్లిపోతే ఈ మండలంలో పశువైద్యాధికారి ఉండని పరిస్థితి ఏర్పడనుంది. సాలూరు మండలం బాగువలస పశువైద్యాధికారి పొలందొర మక్కువ మండలానికి ఇన్‌చార్జిగా సేవలు అందిస్తున్నారు. బలిజిపేట మండలం బర్లి, చిలకలపల్లి కేంద్రాలకు పశువైద్యులు లేరు. ఈ రెండు పశువైద్యశాలలకు కూడా బలిజిపేట పశువైద్యుడు గణేష్ ఇన్‌చార్జిగా ఉంటూ మూగజీవాలకు వైద్యం అందిస్తున్నారు. కొమరాడ మండలం మాదలంగి, గంగిరాయివలసలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ రెండు చోట్ల పశువైద్యులు లేకపోవడంతో కొమరాడ వెటర్నరీ డాక్టర్ సత్యనారాయణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈయనకు విజయనగరం జిల్లా వాడాడ బదిలీ జరిగింది. ఇతను కూడా వెళ్లిపోతే కొమరాడ మండలంలో పూర్తిగా పశువైద్యాధికారి (మిగతా 8వ పేజీలో)



మక్కువ మండలం శంబరలో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

మంత్రి అచ్చెన్నపైనే ఆశలు..

జిల్లాఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లాకు రానున్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు సమావేశానికి ఆయన హాజరు కానున్నారు. పశువైద్య శాఖకు సంబంధించి సమస్యలు పరిష్కరిస్తారని, కొత్త వైద్యుల నియామకం, నూతన భవనాల నిర్మాణాలకు ఆదేశాలు జారీ చేస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

దారుణంగా భవనాలు..

జిల్లాలోని పశువైద్యశాల భవనాల్లో చాలా వరకూ శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో తెలియదు. 24 పశువైద్యశాలల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సీతంపేట మండలం దోనుబాయి, పొల్ల గ్రామాల్లో పశువైద్యశాలలకు సొంత భవనాలు లేవు. వీరఘట్టం మండలం తూడి, పాలకొండ మండలం ఎం.సింగుపురం, తుమరాడ, చిన్నమంగళాపురం పశువైద్యశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. పార్వతీపురం నియోజకవర్గంలోని నర్సిపురం, ఎంఆర్‌నగరం, సాలూరు నియోజకవర్గంలోని సంబర, కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, ఉల్లిభద్ర తదితర పశువైద్యశాలలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ భవనాల్లోనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పశువైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా కొత్త భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

జీడి ప్రాసెసింగ్ పక్కాగా జరగాలి

- ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ



ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న పీవో శ్రీవాత్సవ

పార్వతీపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీడి ప్రాసెసింగ్ పక్కాగా జరగాలని, వీడీవీకేలు నిర్వహించుకునేలా శిక్షణ ఇవ్వాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలోని జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్, నిత్యావసర సరుకుల గోదామును ఆయన గురువారం తనిఖీ చేశారు. అలాగే, వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో జీడిపప్పు ప్రాసెసింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. జీడిపిక్కలను స్టాక్ మేరకు రిజిష్టర్‌లో నమోదు చేసే ప్రక్రియను తనిఖీ చేశారు. జీడి ప్రాసెసింగ్ పక్కాగా జరగాలని ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీడీ ఎ.మురళీధర్, ఇతర అధికారులు ఉన్నారు.

రేపు సీతంపేట ఏజెన్సీలో జాతీయ బృందం పర్యటన

6లో

వృద్ధిరేటు పెరిగేలా ప్రణాళికలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, జూన్26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధి రేటు గణనీయంగా పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సుపరిపాలన కార్యక్రమం నేపథ్యంలో కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నిర్దేశించిన లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఏటా 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయం, తృణధాన్యాల సాగు, డ్రోన్ల వినియోగం, ఆధునిక వ్యవసాయ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, అటవీ, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, ఇంటర్మీడియట్ వైద్యశాఖ అధికారులు పీవీ రాజు, కె.రాబర్ట్‌పాల్, వై.క్రాంతికుమార్, వై.శ్రీదేవి, ప్రసూన, మన్మథరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలు మరింత పెరగాలి

గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మరింత పెరగాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఉపాధ్యాయులను ఆదేశించారు. కొమరాడ మండలం అంకుళ్లవలస, రావిక్రవలస గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలను ఐటీడీఏ పీవో శ్రీవాత్సవతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, కిచెన్ గార్డెన్ నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ సూచించారు.

జగన్నాథ రథయాత్రకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- పది రోజులపాటు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్న స్వామివారు



పూజలందుకుంటున్న జగన్నాథ, బలరామ, సుభద్రలు

పార్వతీపురంటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి తొలి రథయాత్రకు సర్వం సిద్ధమైంది. దీనికోసం జిల్లాలోని ప్రధాన ఆలయాలు, రథాలు ముస్తాబయ్యాయి. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి పది రోజుల పాటు వివిధ రూపాల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. రథంపైన కొలువుదీరే సుభద్ర, జగన్నాథస్వామి, బలభద్రుడు ఉత్సవ విగ్రహాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలోని దంగిడి వీధిలో ఉన్న జగన్నాథస్వామి ఆలయంలో ఈవో ఎం.ప్రసాదరావు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి తొలి రథయాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ప్రధాన ఆలయం నుంచి గుడించా మందిరం వరకు మేళాతాళాలతో రథయాత్ర జరగనుందని చెప్పారు. తొలిరోజు స్వామివారు శుభమంగళ రూపంలో, 28 నుంచి జూలై 5న జరిగే మారు రథయాత్ర వరకు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.



పార్వతీపురంలో సిద్ధమైన రథం

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపు

6లో



ఈగల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర

పోలింగ్ స్టేషన్ల హేతబద్ధీకరణకు సలహాలు ఇవ్వండి

- జిల్లా రెవెన్యూ అధికారి హేమలత

పార్వతీపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్‌స్టేషన్ల హేతుబద్ధీకరణకు తగిన సలహాలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం ఆమె తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ప్రతి నెలా డీఈవో లేదా ఈఆర్‌వో స్థాయి సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించినట్టు తెలిపారు. డీఈవో, ఈఆర్‌వో, బీఎల్‌వోలతో సహా అధికారులందరూ పారదర్శకంగా పనిచేయాలని సూచించినట్టు చెప్పారు. ఈసీ జారీ చేసే నియమాలు, మార్గదర్శకాలపై తగిన సలహాలను జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు నుంచి కోరుతున్నట్టు ఆమె తెలిపారు. పోలింగ్‌బూత్‌లో 800 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా చూడాలని, ప్రతి ఓటరు నివాసం నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఈసీ ఆదేశించినట్టు వివరించారు. హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రతి ఈఆర్‌వో రానున్న రెండు నెలల్లోపు పోలింగ్ కేంద్రాలను విలీనం చేయడం, ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రాలకు మార్చడం వంటివి చేపట్టాల్సి ఉందన్నారు. ఆరోగ్యకరమైన ఓటరు జాబితాను తయారు చేసేందుకు బీఎల్‌వోలకు రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. ఇందుకు సంబంధిత పార్టీలు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్‌లెవెల్ ఏజెంట్లను నియమించాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ల ఫొటో గ్రాఫ్, మొబైల్ నెంబర్‌ను చేర్చడానికి ఫారం బీఎల్ఏ-2కు ఎన్నికల సంఘం కొన్ని సవరణలు చేసిందని అన్నారు.

గ్రంథాలయాలకు కొత్త సొబగులు

- రూ.50 లక్షల సెస్ నిల్వ నిధులు
- కొత్త పుస్తకాల కొనుగోలు
- ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరణ

6లో

రోడ్డు పక్కనే డంపింగ్

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాటసారులు, వాహనచోదకులు
- ఇదీ పార్వతీపురంలోని డంపింగ్ యార్డు పరిస్థితి

6లో



ఇంజనీరింగ్ శాఖలో కుర్చీలాట

- నేనే ఈఈ అంటున్న కుమార్
- కాదు నేను అంటున్న రమాదేవి
- చాంబర్‌లో వేర్వేరుగా కుర్చీలపై కూర్చున్న వైనం
- పీవో చొరవతో సద్దుమణిగిన వివాదం
- కుమార్‌కే దక్కిన అవకాశం





ఐటీడీఏలోని ఇంజనీరింగ్ శాఖ కార్యాలయం

సీతంపేట రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలో ఈఈ పోస్టుపై కుర్చీలాట చోటుచేసుకుంది. ప్రభుత్వం తననే ఈఈగా నియమించిందంటూ ఓ అధికారి అంటే, కాదు కోర్టు ఉత్తర్వుల మేరకు తానే ఈఈగా కొనసాగుతానంటూ మరో అధికారి అనడం వివాదానికి దారి తీసింది. ఇద్దరు అధికారులు కూడా ఈఈ చాంబర్‌లో వేర్వేరుగా కుర్చీలేసి కూర్చున్నారు. దీంతో ఎవరు ఈఈ అనేది తెలియక సిబ్బంది ఇబ్బంది పడ్డారు. అయితే, ఐటీడీఏ పీవో చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. ఈఈగా కేవీఎస్ఎన్ కుమార్‌నే కొనసాగించారు.

ఏం జరిగిందంటే..

సీతంపేట ఇంజనీరింగ్ శాఖకు ఈఈగా కేవీఎస్ఎన్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 9న జీవో జారీ చేసింది. ఇక్కడ ఈఈగా పనిచేస్తున్న పి.రమాదేవిని నెల్లూరు ఐటీడీఏకు బదిలీ చేసింది. ప్రభుత్వ జీవో ప్రాప్తికి కుమార్ ఈనెల 11న సీతంపేట ఈఈగా బాధ్యతలు చేపట్టారు. ఈ సమయంలో రమాదేవి సెలవుపై ఉన్నారు. విధి నిర్వహణలో భాగంగా కుమార్ ఢిల్లీ వెళ్లారు. అయితే, తన బదిలీని సవాల్ చేస్తూ రమాదేవి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తానే సీతంపేట ఈఈగా కొనసాగుతానంటూ ఈనెల 18న కార్యాలయానికి వచ్చి రమాదేవి సీట్లో కూర్చున్నారు. ఇంతలో ఢిల్లీ వెళ్లిన కుమార్ గురువారం తిరిగి సీతంపేట ఇంజనీరింగ్‌శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో రమాదేవి, కుమార్ మధ్య కుర్చీలాట మొదలయ్యింది. వీరిద్దరూ ఈఈ గదిలో వేరువేరు కుర్చీల్లో ఆసీనులయ్యారు. దీంతో ఎవరూ తమ ఈఈ అనేదానిపై కార్యాలయ సిబ్బందిలో సందిగ్ధత నెలకొంది. చివరకు ఈ పంచాయితీ ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి వద్దకు చేరింది. ఆయన చొరవ తీసుకొని ఈఈలు ఇరువురితో మాట్లాడారు. అనంతరం ఈ అంశాన్ని రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి పీవో తీసుకువెళ్లారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సీతంపేట ఈఈగా కుమారే కొనసాగుతారని పీవో స్పష్టం చేశారు. ఏమైనా చెప్పాలనుకుంటే గిరిజనసంక్షేమశాఖ ఉన్నతాధికారులను సంప్రదించాలని రమాదేవికి ఆయన సూచించారు. దీనిపై ఈఈ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తాను ఈఈగా కొనసాగుతున్నానని, ఇందులో వివాదం ఏముందని సమాధానం ఇచ్చారు.

గ్రంథాలయాలకు కొత్త సొబగులు



- రూ.50 లక్షల సెస్ నిల్వ నిధులు
- కొత్త పుస్తకాల కొనుగోలు
- ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరణ

రాజాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి):

గ్రంథాలయాలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. వాటిని మరింత బలోపేతం చేసి పాఠకులను పెంచాలన్న యోచనలో ఉంది. ఇటీవల పాఠశాల విద్యార్థులకు వేసవి శిబిరాలు నిర్వహించింది. వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులను కూడా అందించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలకు కొత్త పుస్తకాల కొనుగోలుకు సెస్ నిల్వల నుంచి రూ.50 లక్షలు కేటాయించింది. ఇప్పటివరకు విజయనగరం కేంద్ర గ్రంథాలయంలో 50 వేల వరకు పుస్తకాలు ఉన్నాయి. శాఖ గ్రంథాలయాల్లో 8 వేల నుంచి 16 వేల వరకు ఉన్నాయి. వీటికి అదనంగా పుస్తకాలను సమకూర్చనున్నారు. అయితే ఏఏ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం కూడా కల్పించారు.

సిబ్బంది కొరత..

జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 41 శాఖ గ్రంథాలయాలున్నాయి. కొన్నిచోట్ల గ్రామీణ గ్రంథాలయాలున్నాయి. బుక్ డిపోజిట్, డెలివరీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అయితే సిబ్బంది కొరత, ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రంథాలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికీ చాలా గ్రంథాలయాలకు సరైన భవనాలు లేవు. దశబ్దాల కిందట నిర్మించిన శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ శాఖలు వినియోగించకుండా ఉంచిన భవనాల్లోనే నడుస్తున్నాయి. సిబ్బంది కొరత కూడా అధికంగా ఉంది. శాఖ గ్రంథాలయాలను పర్యవేక్షిస్తున్న లైబ్రేరియన్లంతా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారే. గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఒక్కొక్కరూ పదవీవిరమణ పొందుతున్నా కొత్తగా నియామకాలు లేవు. అలాగని కొన్నేళ్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సైతం నియమించలేదు. దీంతో ఉన్న సిబ్బందితో నెట్టు కొస్తున్నారు. కొన్ని గ్రంథాలయాల్లో ఇంటర్‌నెట్ సేవలు మూణ్నాళ్ల ముచ్చట గానే మిగిలాయి. సాంకేతిక సమస్యలతో సేవలు నిలిచి పోయాయి. వీటిని సైతం పునరుద్ధరించే పనిలో పడింది కూటమి ప్రభుత్వం. రూ.50 లక్షలతో కొత్త పుస్తకాలతో ఆటు ఇంటర్నెట్ సేవలు అందు బాటులోకి తెస్తామని గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు.

డిజిటల్ అంటూ హడావుడి..

డిజిటల్ గ్రంథాలయాల పేరుతో జగన్ సర్కారు శాఖగ్రంథాలయాలను నిర్వీర్యం చేసింది. జిల్లాకు 262 డిజిటల్ గ్రంథాలయ భవనాలు మంజూరు కాగా అప్పట్లో ఒక్కోదానికి రూ.16 లక్షలు కేటాయించారు. చాలాచోట్ల పనులు కూడా ప్రారంభం అయ్యాయి. తొలి విడతగా 2022 ఉగాదికి, రెండో విడత అదే ఏడాది డిసెంబరుకు, మూడో విడత 2023 మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా మూడు భవనాలు మాత్రమే పూర్తిచేశారు. దీన్నిబట్టి వైసీపీ ప్రభుత్వ చిత్తశుద్ధి ఆర్థమవుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో స్థానిక సంస్థలతో పాటు సెస్‌ల రూపంలో నిధులు కేటాయించాల్సి ఉన్నా.. ఆపని చేయలేదు. బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించారు. ఐదేళ్ల పాటు గ్రంథాలయాధికారులు పెడుతున్న ప్రతిపాదనలకు సైతం దృష్టిపెట్టలేదు. కొత్త సేవలను ప్రారంభించక పోగా.. ఉన్నవి కూడా పరిష్కరించకుండా వదిలేశారు. ఇప్పుడు వాటిని గాడిలో పెట్టే ప్రయత్నంలో కూటమి సర్కారు ఉంది.



సేవలు మెరుగుపరుస్తాం..

జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో సేవలు మెరుగుపరుస్తాం. అన్నిరకాల పోటీ పరీక్షలను అందుబాటులోకి తెస్తాం. రూ.50 లక్షలు సెస్ నిల్వల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం వచ్చింది. పుస్తకాల కొనుగోలుకు టెండర్లు పిలుస్తాం. పారదర్శకంగా ప్రక్రియ చేపడతాం. గ్రంథాలయాల్లో ఇంటర్నెట్ సేవలను సైతం పునరుద్ధరిస్తాం.

-బి.లక్ష్మి, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి, విజయనగరం



గొల్లపల్లి మున్సిపల్ హైస్కూలులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

5న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

- పది విద్యార్థులకు పక్కాప్రణాళికతో బోధన
- జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు

బొబ్బిలి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్స్-టీచర్ల మీటింగ్ అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు తెలిపారు. బొబ్బిలి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల, గొల్లపల్లి మున్సిపల్ హైస్కూలును, భవిత కేంద్రాన్ని డీఈవో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన వారికి జూలై 5న సమావేశంలో బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. 'ఈ ఏడాది ఆరో తరగతిలో ప్రవేశాలు ఆశాజనకంగా ఉన్నాయి. చదవడం, రాయడం, మాట్లాడడం వంటి నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందిస్తున్నాము. పదోతరగతి విద్యార్థులకు ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో బోధిస్తున్నాము. హాజరు శాతాన్ని పెంపొందించే చర్యలు చేపట్టాం' అని డీఈవో తెలిపారు. ఉపాధ్యాయులకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తమ కర్తవ్యాలను నిర్వర్తించేలా సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు.

మన బడి- మన భవిష్యత్ నిధులు మంజూరు..

'జిల్లాలో 290 హైస్కూళ్లు, 112 యూపీ, 1278 ఎలిమెంటరీ పాఠశాలలున్నాయి. వాటిలో 37 అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఒక్కొక్కటి రూ.15.5 లక్షలు మంజూరయ్యాయి. మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.9 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలు ఇంకా పెరుగుతాయ'ని డీఈవో తెలిపారు. ఎంఈవోలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసు ఉన్నారు.

నేడు జగన్నాథుడి తొలి రథయాత్ర



తొలి రథయాత్రకు సిద్ధమైన జగన్నాథ, బలభద్ర, సుభద్ర విగ్రహాలు

- రోజుకో రూపంలో భక్తులకు స్వామి దర్శనం

విజయనగరం రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా ఆషాడమాసం ఉత్తరాయన శుద్ధ విదియ నాడు జగన్నాథుడి తొలి రథయాత్ర నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఆషాడం అంటే శూన్యమాసంగా భావించినా ఈ నెలలోనే ఉత్సవాలు జరుగుతా యి. జిల్లా వ్యాప్తంగా అన్ని జగన్నాథుడి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరంలో ఇవి మరింత వైభవంగా నిర్వహి స్తారు. ఇక్కడ దాసన్నపేట జగ న్నాథ స్వామి ఆలయం, సంతపేట జగన్నాథస్వామి ఆలయాలతో పాటు కర్రల మార్కెట్, కమ్మవీధి, మన్నార్ రాజగోపాలస్వామి, కాళ్లనాయుడు మందిరం ఆవరణలో ఉన్న జగన్నాథస్వామి ఆలయాల వద్ద ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల ముందు రథాలను సిద్ధం చేశారు. వాటిని ప్రత్యేకంగా ఆలంకరించారు. తొలి రథయాత్ర నుంచి మలి రథయాత్ర జరిగే వరకూ స్వామి వారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ముఖ్యంగా తొలి రథయాత్ర రోజు జగన్నాథ, బలభద్ర, సుభద్రాదేవి విగ్రహాలను పూజించి, అనంతరం భక్తుల దర్శనం కోసం రథాలపై ఉంచుతారు. రథోత్సవాల్లో భాగంగా నగరంలోని అన్ని ఆలయాల్లో గురువారం నేత్రోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహాపీట పూజను జరిపారు దేవతామూర్తులకు అర్చకులు కంకణాలు కట్టే కార్యక్రమంను నిర్వహించారు. ఈ నెల 27న తొలి రథయాత్ర నిర్వహిస్తుండగా, మలి రథయాత్ర జూలై 6న జరగనుంది. ఆ కార్యక్రమంతో రథయాత్ర ఉత్సవాలు ముగుస్తాయి. రథయాత్ర సాగే ప్రాంతాల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా దాసన్నపేట, సంతపేట జగన్నాథ స్వామి ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.. పైగా ప్రధాన రోడ్లపై రథాలు ఉండడంతో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



రథయాత్ర ఏర్పాట్లు పరిశీలన..

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగన్నాథస్వామి రథాయాత్ర తొలి దశమి ఏర్పాట్లును ఆలయ ఈవో సర్వేశ్వరరావు, టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఏర్పాట్లపై ఈవోను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, భక్తులకు మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



పూజలందుకుంటున్న అమ్మవారు

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కల పేటలో గల సకల దేవతల ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అమ్మవారికి ప్రధాన అర్చకుడు పర్రి శరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. లోక కల్యాణార్థం ఈ నవ రాత్రులు చేపట్టినట్టు ధర్మకర్త కొండబాబు తెలిపారు.



పూజలు చేస్తున్న దృశ్యం



ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రతి విద్యార్థికీ 'తల్లికి వందనం' అందాలి

- పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లికి తల్లికి వందనం పథకం నగదు బ్యాంక్‌ఖాతాలో జమకావాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం దారిమల్లి గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను పీవో పరిశీలించారు. విద్యార్థుల అడ్మిషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులతో పాటు సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, నారాయడు తదితరులు ఉన్నారు.



చినబగ్గ తోటల్లో గజరాజులు

చినబగ్గ సమీపంలో ఏనుగులు

సీతంపేట రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో చినబగ్గ గ్రామ సమీపాన పల్లం ప్రాంతంలో నాలుగు ఏనుగులు సంచరిస్తున్నాయి. గురువారం వేకువజామున ఏనుగులు ఘీంకారాలు వినిపించినట్లు గ్రామస్థులు తెలిపారు. చినబగ్గ ఆశ్రమ పాఠశాల వెనుక ఉన్న తోటల్లో ఏనుగులు తిష్ట వేశాయని అటవీశాఖ బీట్ అధికారి దాలినాయుడు తెలిపారు. ఏనుగుల సంచారాన్ని ఎలిఫెంట్ ట్రాకర్స్ ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

రేపు సీతంపేట ఏజెన్సీలో జాతీయ బృందం పర్యటన

సీతంపేట రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో ఈనెల 28, 29వ తేదీల్లో జాతీయ బృందం పర్యటించనుంది. ఆదివాసీల కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం జన్‌మన్, డీఏ జుగా పథకాలపై ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించనుంది. దీనిలో భాగంగా మోట (మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సెక్షన్ అధికారి) రాహుల్ ఖురానా సీతంపేట ఏజెన్సీలో రెండు రోజుల పాటు పర్యటించి గిరిజన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు, పథకాలపై ఆదివాసీలను అడిగి తెలుసుకోనున్నారు. శనివారం మధ్యాహ్నానికి సీతంపేట ఐటీడీఏకు చేరుకోనున్న కేంద్ర బృందం సీది, గుమ్మడ గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామసభకు హాజరవుతారు. అలాగే ఆదివారం మొగదారగూడ గ్రామంలోని పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలు లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి చినరామ, బుడగరాయి, పాండ్ర, పూతికవలస, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లను సందర్శించనున్నారు. కేంద్ర బృందం పర్యటనకు సంబంధించి ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు పక్కనే డంపింగ్

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాటసారులు, వాహనచోదకులు
- ఇదీ పార్వతీపురంలోని డంపింగ్ యార్డు పరిస్థితి

పార్వతీపురం టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర శివారుల్లో ఉన్న డంపింగ్ యార్డు వల్ల పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని 30 వార్డుల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోకి తీసుకువెళ్లలేక అంతరాష్ట్ర రహదారి పక్కనే పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. అటుగా వెళ్లే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ పకీరు రాజును వివరణ కోరగా వెంటనే ఈ విషయమై కమిషనర్ వెంకటేశ్వర్లుకు తెలియజేశానని, శుక్రవారం యుద్ధప్రాతిపదిక అంతరాష్ట్ర పక్కనే ఉన్న చెత్తను తొలగిస్తారని చెప్పారు.



రహదారిపైకి వచ్చిన డంపింగ్ యార్డు చెత్త

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

- కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పిలుపు

బెలగాం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురాన్ని డ్రగ్‌రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఎంతోమంది జీవితాలు నాశనం అవుతున్నాయని, మత్తుతో చిత్తు కావద్దని అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినం సందర్భంగా పార్వతీపురంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర జెండా ఊపి ప్రారంభించారు. శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలస్థాయి నుంచే మత్తు పదార్థాల పట్ల కలిగే నష్టాలపై అవగాహన ఉండాలని, వాటి నియంత్రణకు చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలను రూపుమాపాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. జిల్లాలో డ్రగ్స్‌ను నిర్మూలించడానికి ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు వినియోగిస్తే 1972 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత జీవితాన్ని నాశనం చేస్తాయని, మత్తుతో చిత్తు కాకుండా వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఆశుతోష్ శ్రీవాస్తవ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా సూపరిండెంటెంట్ శ్రీనాథుడు



మత్తుకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

- ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిడెంట్ంట్ శ్రీనాథుడు

విజయనగరం క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తును అంధకారంలో నెట్టేస్తున్న మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా సూపరిండెంటెంట్ శ్రీనాథుడు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోదక దినం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కళాశాల రాజీవ్‌నగర్ నుంచి గుమ్చీ, లయన్సుక్లబ్, కోట జంక్షన్ వరకూ ర్యాలీ జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో శ్రీనాథుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదక ద్రవ్యాలను పూర్తిగా నిరోధించేందుకు కార్యచరణ రూపొందించాయన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్-1 సీఐ మన్మథకుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- విజయనగరం రూరల్ సర్కిల్ పరిధిలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినం సందర్భంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కళాశాల నుంచి బీసీ కాలనీ పార్కు వరకూ ర్యాలీ జరిపారు. రూరల్ సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి, ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు వదిలితేనే భవిత

● జిల్లావ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక దినం

● పెద్దఎత్తున అవగాహన సదస్సులు, ర్యాలీలు

(ఆంధ్రజ్యోతి-బృందం)

జిల్లావ్యాప్తంగా గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినం నిర్వహించారు. పట్టణాలు, మండలాల్లోని కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సద స్సులు నిర్వహించారు. కార్యక్రమాల్లో న్యాయాధికారులు, ఎమ్మెల్యేలు, ఎక్సైజ్, పోలీసులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీల్లో వారు పాల్గొన్నారు.


కొత్తవలస: మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ్‌చందర్


రాజాం: ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, డీఎస్పీ తదితరులు



పూసపాటిరేగ: ర్యాలీలో ఎమ్మెల్యే నాగమాధవి


రాజాం రూరల్: మాట్లాడుతున్న న్యాయాధికారి శారదాంబ


ఎల్.కోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి


ఎస్.కోటలో అవగాహన ర్యాలీ


గజపతినగరం: అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి విజయ్ రాజ్‌కుమార్


భోగాపురం: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్


చీపురుపల్లి: పట్టణంలోని మూడు రోడ్ల కూడలిలో మానవహారం

దివ్యాంగులకు పరికరాలు

రాజాం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న జీరో నుంచి 18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ విద్యార్థులకు స్థానిక భవిత కేంద్రంలో ఎంఈవోలు ప్రవీణ్ కుమార్, దుర్గారావు ఉచితంగా వివిధ పరి కరాలను గురువారం అందజేశారు. వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్ రోలేటర్స్‌సీపీ చైర్స్ తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిసోర్స్ టీచర్స్ ఎస్.హరిబాబు. వి.శ్రీనివాసరావు, శాంతికుమారి పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

శృంగవరపుకోట రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల ద్వారా వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో జీవనరాణి హెచ్చరించారు. గురువారం కొట్టాం పీహెచ్‌సీని ఆమె పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది ఆలస్యంగా వస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఇకపై పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఆమెతో పాటు వైద్యాధికారి హారిక, హెల్త్ ఎడ్యుకేటర్ అనీల్ ప్రేమ్‌కుమార్, సీహెచ్‌వో వేణుగోపాలరావు తదితరులున్నారు.

చెట్ల తొలగింపుపై ఫిర్యాదు

శృంగవరపుకోట, జూన్26 (ఆంధ్రజ్యోతి): తమ సాగు భూముల్లో దౌర్జన్యంగా చెట్లను తొలగించడంతో పాటు కులం పేరుతో దూషించారని జిందాల్ ప్రతినిధిపై బందవలస గిరిజనులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన నాయకుడు తమ్మి అప్పలరాజుదొర ఆధ్వర్యంలో గిరిజనులు కోరారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

నెల్లిమర్ల, జూన్26 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల సామాజిక ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. నెల్లిమర్ల సామాజిక ఆసుపత్రిలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం కమిటీ ఛైర్మన్ నాగమాధవి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 24 గంటలు రోగులకు సేవలు అందించి తద్వారా వారికి మెరుగైన ఆరోగ్యం చేకూరేలా చేయాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ గీతాభవాని, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, లోకం ప్రసాద్, ఆసుపత్రి కమిటీ సభ్యులు, మజ్జి రాంబాబు, దుర్గాసి శేఖర్, నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారకనాథ్, జనసేన నాయకులు కరుమజ్జి గోవిందరావు, ఎంఎం.నాయుడు, గంటా సతీష్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్

రాజాం, జూన్26 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ సరుకులు అందించేందుకు గురువారం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. జూలై రేషన్ ముందుగానే గురువారం నుండి రేషన్ డీలర్లు ద్వారా వారి ఇంటి వద్దకే ఇవ్వడం జరుగుతోందన్నారు. అలాగే వంగర మండలంలో ఏనుగులు తిష్ట వేయడంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీశాఖ అధికారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, దుప్పపూడి శ్రీనివాసరావు, శాసపు రమేశ్‌కుమార్, ముగడ శ్రీను, శాసపు రాజేశ్‌కుమార్ ఉన్నారు.

రైతులను టెర్రరిస్టుల్లా చూడటం తగదు

శృంగవరపుకోట రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): భూముల కోసం పోరాటం చేస్తున్న జిందాల్ నిర్వాసితులను పోలీసులు పాకిస్థాన్ టెర్రరిస్టుల్లా చూడటం దారుణమైన చర్య అని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. గురువారం ఆయన బొడ్డవరలో నిర్వాసితులతో మాట్లాడారు. హక్కుల కోసమే రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. ఇక్కడకు వస్తున్న పరిశ్రమలను అడ్డుకోలేదన్నారు. తమకు న్యాయంగా రావాల్సిన హక్కులు, పరిహారాలను కోరుతున్నారన్నారు. ఈ తరుణంలో నిర్వాసితులు వేసిన టెంట్‌ను కూల్చేశారని, వారికి భోజనాలు ఇవ్వవద్దని బెదిరించడం తగదన్నారు. ఇప్పటికే లోకాయుక్త, హ్యూమన్ రైట్స్ కమిషన్, లేఖలు పంపించామన్నారు.

ఘనంగా అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకలు

● ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

విజయనగరం రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు సునీలా గజపతిరాజు, ప్రసాదుల కనకమహాలక్ష్మితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పలువురు రాష్ట్ర మంత్రులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులు ఫోన్ ద్వారా అశోక్ గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని సిటీబస్టాండ్ వద్ద ఉన్న సిద్ధిబుద్ధి వినాయక ఆలయంలో అశోక్ గజపతిరాజు, సునీలా గజపతిరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూడు లాంతర్లు వద్ద పైడితల్లమ్మ చదురుగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఈవోశిరీష అందజేశారు. నగరంలోని ప్రేమ సమాజంలో వృద్ధులకు దిండ్లు పంపిణీ చేశారు. ప్రేమ సమాజంలో పాలకమండలిప్రతినిధులు అశోక్ గజపతిరాజు పేరిట వృద్ధులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని అందించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబినాయన, సువ్వాడ వనజాక్షి, సువ్వాడ రవిశేఖర్, ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు,పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, వివిధ స్వచ్ఛంద సేవాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.


పైడిమాంబను దర్శించుకుంటున్న అశోక్ గజపతిరాజు, సునీలా గజపతిరాజు

భూ ఆక్రమణలను గుర్తించండి

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూన్26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెండు రోజుల్లో ఆక్రమిత భూముల వివరాలను వీఆర్వోలు నమోదు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలా క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. జీవో నెంబరు 30 ప్రకారం 260 దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి వచ్చే వారంలో నాటికి జేసీ లాగిన్‌లోకి పంపాలన్నారు. అందరీ గృహ పథకం కింద జిల్లాలో 6 వేలు దరఖాస్తులు అందాయన్నారు. వీటిని వెరిఫై చేసి వెంటనే ఆన్‌లైన్‌లో చేయాలన్నారు. ఖాళీ స్థలాలను దరఖాస్తులతో మాపింగ్ చేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సర్వేయర్లు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదనే ఫిర్యాదులు అందుతాయన్నారు. వారికి వెంటనే మెమోలు జారీ చేయాలన్నారు. వారీ జీతాలను నిలుపుదల చేయాలని ల్యాండ్ రికార్డ్స్ ఏడీని ఆదేశించారు. వారికి సెలవులు మంజూరు చేయవద్దన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టర్‌ను కలిసిన ఎన్జీవో ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, జూన్26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు ఏడాది పూర్తి చేసుకున్న కలెక్టర్ అంబేడ్కర్‌ను గురువారం రోడ్డు సేఫ్టీ ఎన్జీవో అధ్యక్షుడు మజ్జి అప్పారావుతో పాటు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంస్థ సభ్యులు హరిబాబు, శ్రీరామ్మూర్తి, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

నెల్లిమర్ల, జూన్26 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టంకలిగించే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు చేయాలన్న డిమాండ్‌తో పాటు మరికొన్ని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు స్పష్టం చేశారు. గురువారం నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారకనాథ్‌కు నోటీసును అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిదులు బాబూరావు, హరిబాబు, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలోనే వేట సామగ్రి

● ఆందోళన చెందుతున్న మత్స్యకారులు

భోగాపురం, జూన్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం తీరంలో కొన్ని రోజులుగాసముద్రం ముందుకు రావడంతో మత్స్యకారులు బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా మత్స్యకారులు తమ వేట సామగ్రి, పడవలను తీరంలోనే నిలుపుతారు. అయితే సముద్రం ముందుకు రావడం వల్ల అవి అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయే అవకాశం ఉందిన భయపడుతున్నారు.లేకుంటే పడవలు బోల్తా పడి విరిగే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అయితే సముద్రం గతం కంటే బాగా ముందుకు రావడంతో వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించే వీలు లేకుంది. అవకాశం ఉన్నమేరకు కొందరు వాటిని తరలిస్తున్నారు. మిగిలిన వారు వాటిని ఎలా భద్రపరచాలే తెలియక తలలు పట్టుకుంటున్నారు.


పడవల సమీపానికి వచ్చిన సముద్రం

ఎంవీజీఆర్‌లో మెగా రక్తదాన శిబిరం

డెంకాడ, జూన్26 (ఆంధ్రజ్యోతి):కేంద్ర మాజీ మంత్రి, టీఈపీ నేత అశోక్ గజపతిరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఎంవీజీఆర్ కళాశాలలో రక్తదన శిబిరం నిర్వహించినట్టు కళాశాల కరస్పాండెంట్ కేవీఎల్ రాజు తెలిపారు. గురువారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ మాన్సాస్ ఛైర్మన్ అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకల సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. శిబిరంలో మన్సాస్ విద్యాసంస్థల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 94 యూనిట్ల రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో ఎంవీజీఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.ఎస్.సీతారామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, ఎన్ఎస్ఎస్ ఈవో ఎన్.షణ్ముఖరావు, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి కె.సత్యం పాల్గొన్నారు.


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న శిబిర నిర్వాహకులు

బధిరుల సొసైటీకి రూ.50 వేల విరాళం

భోగాపురం, జూన్26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ నేత పి.అశోక్ గజపతిరాజు జన్మదినం సందర్భంగా గురువారం విజయనగరానికి చెందిన బధిరుల సొసైటీకి రూ.50 వేల విరాళాన్ని మార్కెఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ప్రకటించారు. సంబంధిత చెక్కును అశోక్ గజతిరాజుకు ఆయనఅందజేశారు. ఈసందర్భంగా అశోక్ గజపతిరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, కర్రోతు రాజు ఉన్నారు.


చెక్కును అందజేస్తున్న బంగార్రాజు

అమరావతి ప్రజాదర్బార్‌లో నాగార్జున

చీపురుపల్లి, జూన్26 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లా పార్టీ అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మెన్ కిమిడి నాగార్జున పాల్గొన్నారు. ప్రతివారం పార్టీ కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్‌లో రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు పాల్గొని రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తారు. గురువారంనిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజుతో కలిసినాగార్జున.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


వినతులను స్వీకరిస్తున్న నాగార్జున

విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

లక్కవరపుకోట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దళిత ఉద్యమ నేత ఉదయ్‌భాస్కర్ కోరారు. గురువారం ఆయన దళితులతో కలిసి ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు దళితనేతలు పాల్గొన్నారు.

15 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తాం

● డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ

శృంగవరపుకోట రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): అన్యాయం జరిగిందని పోరాటం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు వారి సమస్యలను తనతో పాటు ఎమ్మెల్యే, తహసీల్దార్, కలెక్టర్ దృష్టిలో పెడితే 15 రోజుల్లో పరిష్కారమవుతామని డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని జిందాల్ కార్యాలయం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పరిశ్రమలు రావాలనీ దీక్ష చేస్తున్న వారిని ఆయన కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ కల్పనకు మహాయజ్ఞం చేస్తోందన్నారు. ఈ తరుణంలో జిందాల్ యాజమాన్యం ముఖ్యమంత్రిని కలిసి ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. దీని ద్వారా 25వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. దీన్ని కొందరు అడ్డుకునే యత్నం చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, టీడీపీ నాయకులు మంగరాజు, ఉమా మహేశ్వరరావు, సన్యాసినాయుడు ఉన్నారు.


మాట్లాడుతున్న డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ

పెళ్లైన నెలరోజులకే..

● విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి

శృంగవరపుకోట రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి) : ఆ యువకుడికి పెళ్లయి నెలరోజులే అయ్యింది. ఇంకా పెళ్లి వాతావరణం ఇంటిని వీడలేదు. ఆ ముచ్చట్లు ఇంకా చెప్పుకుంటూ కొత్త జంటను అందరూ ఆటపట్టిస్తున్నారు. అయితే ఈ కుటుంబంపై విధి కన్నెర్ర జేసింది. అంతే ఆ యువకుడు మృత్యుఒడికి చేరాడు. ఈ ఘటన మండలంలోని వేములాపల్లిలోచోటు చేసుకుంది. వేములాపల్లికి చెందిన లగుడు అప్పలమల్లేశ్వరరావు, జ్యోతిలకు ఇద్దరు కుమారులు. ఇందులో పెద్ద కుమారుడు లగుడు ప్రదీప్(27)నకు నెలరోజుల కిందట విశాఖ జిల్లా పద్మనాభ మండలానికి చెందిన యువతితో పెళ్లిచేశారు. అందరూ చాలా ఆనందం ఉన్నారు.అయితే గురువారం ఉదయం తన తల్లితో పశువులకు గడ్డి తెచ్చేందుకు ప్రదీప్ వెళ్లాడు. తల్లి గడ్డి కొయ్యడంతో దాన్ని ఇంటికి తెచ్చే క్రమంలో మోపు కట్టి తలపై పెట్టుకుని వస్తున్నాడు. అతడు తెస్తున్న మోపు తెగిపడిన విద్యుత్ తీగను తాకింది. దాంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గుండెలవిశేలా రోదించారు. ప్రదీప్ మృతికి విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.


ప్రదీప్ (ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొబ్బిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రోత్ సెంటరులోని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ (ఎలక్ట్రికల్) స్టోర్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ గుర్తు తెలియని వ్యక్తులతో హత్యాయత్నానికి గురైన వ్యక్తి విజయనగరం ఆసుపత్రిలో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక దిబ్బవీధికి చెందిన కనిమెరక వెంకటరమణ (55) గ్రోత్‌సెంటరులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20న రాత్రి విధుల్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆయనను తీవ్రంగా కొట్టి గాయపరిచి పారిపోయారు. గాయపడ్డ వెంకటరమణ తేరుకుని సమీపంలో గల పెట్రోల్ బంకు దగ్గరికి అర్ధరాత్రి వేళ కుప్పకూలిపోయాడు. అక్కడ ఉన్న స్థానికులు గుర్తించి అతని ఫోన్‌లో నుంచి కుమారుడు పురుషోత్తం నెంబరును తెలుసుకుని అతనికి సమాచారం అందించారు. హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చేర్పించారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ఆ సమయంలో ఆసుపత్రికి వచ్చి అతని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అప్పటి నుంచి అపస్మారక స్థితిలో ఉన్న వెంకటరమణ విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు ఒంటి గంట సమయంలో మృతిచెందాడు. సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్ రంగంలోకి దిగి, దర్యాప్తు చేస్తున్నారు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు పురుషోత్తం, కుమార్తె స్వాతి, అల్లుడు రవి ఉన్నారు. వీరంతా నిరుపేదలని, మృతుడైన వెంకటరమణకు ఎవరూ శత్రువులు లేరని ఆ వార్డు కౌన్సిలరు దిబ్బ సునీతాగోపి తెలిపారు. హత్యానేరం కింద కేసు నమోదు చేసి, నిందితుల కోసం మూడు బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నట్టు సీఐ సతీష్‌కుమార్ వివరించారు.


వెంకటరమణ (ఫైల్)

డోలీలో బాలింత తరలింపు

● 15 కిలోమీటర్లు మోసుకెళ్లిన గిరిజనులు

శృంగవరపుకోట రూరల్ జూన్ 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గిరిశిఖర పంచాయతీ దారపర్తి గ్రామానికి చెందిన గర్భిణి పాడి సుకరమ్మ గురువారం ఇంటి వద్ద బిడ్డను ప్రసవించింది. బిడ్డను ప్రసవించిన అనంతరం ఆమెకు ఆరోగ్యం బాగులేకపోవడంతో కుటుంబ సభ్యులు రాయిపాలెం వరకు సుమారు 15 కిలోమీటర్లు డోలీలో మోసుకుని వెళ్లారు. అక్కడ నుంచి ఒక ఆటో ఏర్పాటు చేసి ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయంపై గిరిజనులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా రోడ్డు పనులు మొదలెట్టి కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకపోవడం పనులు నిలిచి పోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆ పనులను ప్రారంభించిందన్నారు. గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో డోలీల మోత తప్పడం లేదన్నారు.


డోలీలో బాలింతను తీసుకువస్తున్న దృశ్యం

కొత్తవలస రైల్వే స్టేషన్‌లో టికెట్ తనిఖీలు

● 2,030 మంది నుంచి రూ.12 లక్షల జరిమానా వసూలు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టికెట్ లేని ప్రయాణాన్ని నియంత్రించడంతో పాటు ప్రయాణికుల భద్రత, సురక్షితమైన ప్రయాణం అందించడంలో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలోని కొత్తవలస రైల్వే స్టేషన్‌లో గురువారం టికెట్ తనిఖీలు చేపట్టారు. కమర్షియల్ విభాగం, ఆర్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నవారితోపాటు పార్శిల్ బుకింగ్ ద్వారా తీసుకువెళ్లాల్సిన లగేజిని కోచ్‌లో తీసుకువెళుతున్నవారిపై 2,030 కేసులు నమోదు చేసి వారి నుంచి సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒకేరోజులో అత్యధిక కేసులు నమోదు చేయడంతోపాటు సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేయడం ఇదే ప్రథమమన్నారు. సురక్షిత ప్రయాణ పద్ధతులు పాటించాలని, తప్పనిసరిగా టికెట్ తీసుకోవాలని, రైలు ఎక్కే, దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.


కొత్తవలస స్టేషన్‌లో చెకింగ్ సిబ్బంది

ధైన్యం.. పశువైద్యం

(5వ పేజీ తరువాయి)

ఉండని పరిస్థితి నెలకొంటుంది. బదిలీపై వెళ్తున్న వారి స్థానంలో కొత్త వైద్యులను నియమించాల్సి ఉంది. కానీ, జిల్లాలో మాత్రం కొత్తవారిని ఉన్నతాధికారులు నియమించలేదు. కొమరాడ, చిన్నమంగాపురం, పార్వతీపురం పశువైద్యులు సత్యనారాయణ, సిద్ధార్థ, శ్రీనివాసరావుకు ఇతర జిల్లాలకు బదిలీ జరిగినా వారి స్థానంలో కొత్తవారు రాలేదు.

ఈ సమస్యలూ పరిష్కరించాలి..

జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య నెలకొంది. సీతంపేట, పార్వతీపురంలో చేపడుతున్న సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల భవనాల పనులు పూర్తి కాలేదు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఆధునీకీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. విద్యాశాఖ, గృహ నిర్మాణశాఖ, మత్స్యశాఖ తదితర శాఖలకు జిల్లా అధికారులు లేరు. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ప్రత్యేక అడుగులు పడడం లేదు. ఇటువంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. కూటమి ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ కొన్ని సమస్యలు జిల్లాలో ప్రజలను వెంటాడుతున్నాయి. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే విధంగా మంత్రి అచ్చెన్నాయుడు కృషి చేస్తారని జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందించాం

జిల్లాలో 20 పశువైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సుమారు 24 భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. పాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఉన్న సిబ్బందితోనే పశువులకు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మన్మథరావు, జిల్లా పశువైద్యాధికారి, పార్వతీపురం

చెడ్డపేరు తెస్తే ఊరుకునేది లేదు

● మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

పార్వతీపురంటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పురపాలనకు సంబంధించి అధికారులైనా, ఉద్యోగులైనా చెడ్డ పేరు తెస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరీ హెచ్చరికలు జారీ చేశారు. మున్సిపాల్టీలో అధికారుల మధ్య వివాదాలు, ఉద్యోగుల తీరుకు సంబంధించి గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన 'పూర్ పాలన' అన్న కథనానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ స్పందించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్వో రూబేను, ఫిర్యాదుదారులైన ఉద్యోగ సంఘ నాయకులు వినయ్, ఈశ్వరరావు, తదితరులతో చర్చించారు. మున్సిపల్ పరిపాలనలో అధికారులు, ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు సమన్వయంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గత కొన్ని రోజులుగా మున్సిపల్ కమిషనర్‌తో పాటు రూబేను వ్యవహార శైలిపై సంబంధించి తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇక నుంచైనా అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

క్షమాపణలు చెప్పాల్సిందే..

ఉద్యోగుల పట్ల అనుచిత వైఖరి అవలంబిస్తున్న ఆర్వో రూబేను లిఖిత పూర్వకంగా క్షమాపణలు చెప్పాలనే మహిళా ఉద్యోగుల డిమాండ్‌ను చైర్‌పర్సన్ గౌరీశ్వరీ మద్దతు పలికారు. ఆర్వో రూబేను తన చాంబర్‌కు పిలిపించి 'మహిళా, ఇతర ఉద్యోగుల పట్ల మీరు వ్యవహరిస్తున్న తీరు నిబంధనలకు విరుద్ధంగా ఉంది.. వెంటనే వారికి క్షమాపణలు చెప్పాలి' అని ఆమె కోరగా ఆయన అంగీకరించారు. ఈ విషయమై మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకుడు వినయ్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరీ చెప్పినట్లు ఆర్వో ఇక నుంచి ఉద్యోగులపై వేధింపులను ఆపకపోతే పెన్‌డౌన్ కాదు, నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జియ్యమ్మవలస, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కురుపాం, జియ్యమ్మవలస మండలాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని మండల విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. గురువారం ఆయన ఈ విషయాన్ని విలేకర్లకు తెలిపారు. ● భామిని: మండలంలోని గురండి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గురండి, బత్తిలి, కాట్రగడ, మనుమకొండ, నులకజోడు, వడ్డంగి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ● పాలకొండ: నవగాం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగుపురం, నవగాం, మల్లివీడు, డోలమడ, బడ్డుమాసంగి, డోలమడ, బడ్డుమాసంగి, జంపరకోట, అవలంగి, పనుకువలస, అట్టలి, తుమరాడ, చింతాడ, వాటుపాగు, బెజ్జి, టీకేరాజపురం, టీడీ పారాపురం, దుగ్గి, నక్కపేట ప్రాంతాలకు విద్యుత్ ఉండదన్నారు.

అశోక్ గజపతిరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు

పార్వతీపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరంలోని అశోక్ బంగ్లాలో గురువారం జరిగిన అశోక్ గజపతిరాజు పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

వీరఘట్టం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీపీవో కొండలరావు అన్నారు. వీరఘట్టం మేజర్ పంచాయతీలోని వాటర్ ట్యాంక్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. వాటర్ ట్యాంకులను కచ్చితమైన సమయానికి శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం ఆయన రేగులపాడు గ్రామాన్ని సందర్శించి, ఇంటింటి నుంచి చెత్త సేకరణను పరిశీలించారు. పంచాయతీ ఈవో కోటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

గరుగుబిల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో చెత్త సేకరణపై గ్రీన్ అంబాసిడర్లు ప్రత్యేక దృష్టి సారించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. ఉద్దవోలు, దళాయివలస, ఉల్లిభద్ర పంచాయతీల్లో చెత్త సేకరణ నిర్వహణను ఆయన గురువారం పరిశీలించారు. ఈ పరిశీలనలో కార్యదర్శులు సీహెచ్‌వీ కూర్మినాయుడు, వి.దివాకర్ తదితరులు ఉన్నారు.

కర్షక సమ్మెను జయప్రదం చేయాలి

గరుగుబిల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త కార్మిక, కర్షక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి బీవతఈ రమణ పిలుపునిచ్చారు. జూలై 9న నిర్వహించనున్న సమ్మెకు సంబంధించి మండల కేంద్రంలో గురువారం జీపు జాతా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతి, శ్రామిక సంఘ ప్రతినిధి వి.ఇందిర పాల్గొన్నారు. ● కురుపాం: కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న జీపు జాతా గురువారం కురుపాం చేరుకుంది. సీఐటీయూ నాయులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జె.సరో పాల్గొన్నారు.

రెండో రోజుకు కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

సాలూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంజనీరింగ్ విభాగ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి పర్మినెంట్ చేయాలన్నారు. 15 సంవత్సరాలు దాటిన వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు.

రోగులకు అందుబాటులోకి మరో వార్డు

సీతంపేట రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో వసతి సమస్య వెంటాడుతున్న నేపథ్యంలో సూపరెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోగుల కోసం ఆసుపత్రి మొదటి అంతస్థులో ప్రత్యేక వార్డును గురువారం ఏర్పాటు చేశారు. పై అంతస్థులో చిన్నారుల కోసం వార్డు ఉన్నప్పటికీ ఇటీవల జ్వరపీడితులు సంఖ్య ఎక్కువగా ఉండడంతో వసతి సమస్య వెంటాడింది. దీంతో సూపరింటెండెంట్ ప్రత్యేక చొరవ తీసుకుని చిన్నారులు, పెద్దల కోసం ప్రత్యేక వార్డును వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇకపై మెరుగైన వైద్య సదుపాయాలు అందనున్నాయి.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు, అధికారులు, ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, మంచి జీవనశైలి అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



బొబ్బిలి: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కురుపాం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొండలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు



సాలూరులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉద్యోగులు

పాలమెట్ట చానల్ పనులకు ఉపక్రమించిన ఎమ్మెల్సీ

● అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు

వీరఘట్టం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగావళి నదికి ఆనుకొని ఉన్న పాలమెట్ట ఓపెన్‌హెడ్ చానల్ వద్ద పనులు ప్రారంభించేందుకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఉపక్రమించారు. గురువారం వైసీపీ శ్రేణులను వెంట తీసుకుని అక్కడకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వమే కాలువ పనులు చేస్తుందని, ప్రైవేటు వ్యక్తులు చేయవద్దని సూచించారు. టీడీపీ నాయకులు కూడా కాలువల పనుల వద్దకు వస్తామని చెప్పడంతో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ కళాధర్ ఆధ్వర్యంలో 80 మంది పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీని, వైసీపీ శ్రేణులను అక్కడ నుంచి పంపించారు.

పూర్తయిన పనులను చేస్తామనడం విడ్డూరం

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండలం పాలమెట్ట చానెల్ పనులను కూటమి ప్రభుత్వం రూ.11 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే జయకృష్ణ ఆధ్వర్యంలో పూర్తి చేసిందని, ఆ పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు అన్నారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. పాలమెట్ట చానెల్ పనులు పూర్తి చేసిన తర్వాత రైతుల మధ్య చిచ్చుపెట్టేందుకు ఎమ్మెల్సీ విక్రాంత్ చానల్ పర్యటనకు వెళ్లి విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రయత్నం చేశారన్నారు. పాలమెట్ట చానెల్ తమ సొత్తుగా విక్రాంత్ భావిస్తున్నారని, అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఎటువంటి నిధులు మంజూరు చేయకుండా రైతులతోనే చందాలు ఎత్తుకుని చానెల్ మరమ్మతులు చేసిన దౌర్భాగ్య పరిస్థితి అన్నారు. ఈ సమావేశంలో ఆయకట్టు రైతులు, నీటి సం ఘాల ప్రతినిధులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, గేదెల రమేష్, హరిబాబు, పాలవలస నీలా ప్రసాద్, ఉదయాన ఉదయ్ భాస్కర్, గంగునాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

మక్కువ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించాలని గత ఏడాది వెయ్యికి పైగా దరఖాస్తులు సమర్పించినా రెవెన్యూ అధికారులు పరిష్కరించలేదన్నారు. శంబర గ్రామంలో దళితులు, గిరిజనులకు ఇచ్చిన డీపట్టా భూములను పెత్తందారులు ఆక్రమించి దున్నుకుంటున్నా చర్యలు లేవన్నారు. కొండపోడు సాగు చేస్తున్న గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, గిరిజన సంఘ మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల బ్యాటరీలు మాయం

● యజమానుల ఆందోళన

పార్వతీపురంటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రహదారిలో నిలిచిఉన్న వ్యాన్‌లు, లారీలకు సంబంధించిన బ్యాటరీలు కొన్ని నెలలుగా చోరీకి గురవుతుండడంతో ఆయా వాహనాల యజమానులు లబోదిబోమంటున్నారు. గురువారం తమ వాహనాల బ్యాటరీలను చోరీ చేస్తున్న దొంగలను పోలీసులు పట్టుకోవాలని కోరుతూ సంబంధిత యజమానులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వాహనాల యజమానులు మాట్లాడుతూ గత కొన్ని నెలలు గా బైపాస్ రహదారిలో నిలిచి ఉన్న వ్యాన్, లారీలకు సంబం ధించిన బ్యాటరీలకు చోరీకి గురవుతుండడం బాధాకరమన్నారు. గత కొన్ని నెలలుగా 5 వ్యానులు, 40 లారీలకు సంబంధించి రూ.8లక్షలు విలువ చేసే బ్యాటరీలను దొంగలు దొంగలించుకెళ్లినట్లు వాహనాల యజమానులైన నర్సింగరావు, దిలీప్, వెంకటరమణ, ఐ.శ్రీను, వై.నారాయణరావు, వి.చిన్నంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పోలీసులకు బ్యాటరీల చోరీపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ విషయమై టౌన్ సీఐ మురళీధర్‌ను వివరణ కోరగా బ్యాటరీల దొంగతనంపై ఇంకా ఫిర్యాదులు రాలేదని, వస్తే వెంటనే దర్యాప్తు ప్రారంభించి చోరీకి పాల్పడ్డ వారిని పట్టుకుంటామన్నారు.

సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు



సీఎంకు వినతిపత్రం అందజేసిన ప్రభుత్వ విప్

కురుపాం/ గుమ్మలక్ష్మీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గ సమస్యల ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లినట్టు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. గురువారం విజయవాడ లోని సీఎం ఇంటికి వెళ్లి ఆమె మర్యాదపూర్వకంగా ఆయన్ని కలిశారు. ఈసందర్భంగా ఆమె స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో ఏనుగుల సమస్యలు పరిష్కరించాలని, కురుపాంలో నిర్మిస్తున్న గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాం పూర్తి చేయడానికి నిధులు విడుదల చేయాలని, గిరిజనులకు సంబంధించిన జీవో నెం.3 స్థానంలో ప్రత్యామ్నాయ జీవోను తీసుకురావాలని కోరినట్టు చెప్పా రు. అలాగే తోటపల్లి, గుమ్మిడిగెడ్డ, ఒట్టిగెడ్డ, జంఝావతి ప్రోజెక్టులు మరియు నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, వినతిపత్రం అందజేశానని ఆమె తెలిపారు.

జల వనరుల శాఖా మంత్రిని కలిసిన ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం/ గరుగుబిల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి విజయవాడలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని తోటపల్లి, గుమ్మిడిగెడ్డ, ఒట్టిగెడ్డ, జంఝావతి ప్రాజెక్టులపై చర్చించారు. ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో 16,684 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందించేలా కృషి చేయాలని విన్నవించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు పూర్తిస్థాయిలో నీరు అందించేలా ప్రొపజల్ పెట్టిన 30 పనులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నియోజకవర్గ నాయకులు మర్రాపు పురుషోత్తం నాయుడు, పొట్నూరు వెంకటనాయుడు ఉన్నారు.

కౌలు రైతు కార్డుల పంపిణీకి సహకరించాలి

సీతానగరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులకు కౌలు కార్డులు పంపిణీకి వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏవో ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో కౌలుకార్డుల పంపిణీపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోల లాగిన్‌లో ఉన్న గత ఏడాది పంపిణీ చేసిన కౌలు కార్డులను పీరియడ్ పూర్తయిన వారికి తిరిగి వెంటనే కౌలు కార్డులు పంపిణీ చేయడానికి సిద్ధం చేయాలని సూచించారు. ఏవో అవినాష్ మాట్లాడుతూ మండలంలో ఇంతవరకు 285 మంది రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేశామని చెప్పారు. ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యశాఖ ఏఎస్‌వోగా కిరణ్‌కుమార్

పార్వతీపురంటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ప్రజారోగ్యశాఖ ఏఎస్‌వోగా ఎన్.కిరణ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మన్యం జిల్లా కేంద్ర డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏఎస్‌వోగా ఉంటూ బదిలీపై మున్సిపల్ ఏఎస్‌వోగా వచ్చారు. మున్సిపల్ ప్రజారోగ్య శాఖలో ఏఎస్‌వోగా విధులు నిర్వహించిన వీబీవీవీ నాయుడు బదిలీపై అనకాపల్లి జిల్లా మున్సిపాల్టీకి వెళ్లారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జనన, మరణ నమోదు, ధృవీకరణ పత్రాల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా చూస్తానని చెప్పారు.

పాఠశాలను తరలించవద్దు

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని పాఠశాలను తరలించవద్దని బెజ్జి గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం నిరసన తెలిపారు. గ్రామంలోని పాఠశాలను తలవరం గ్రామంలో ఉన్న యూపీ పాఠశాలకు తరలించడం తగదన్నారు. తమ గ్రామ విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని జిల్లా అగ్నిమాపక అధికారి పి.సింహాచలం సూచించారు. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టిన అనంతరం స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట స్థానిక అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో భారీ వర్షం

గుమ్మలక్ష్మీపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో భారీ వర్షం పడింది. ఈ వర్షం కారణంగా చెరువులు నీటితో నిండాయి. పొలాల్లో నీరు చేరింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

తహసీల్దార్‌గా రాధాకృష్ణమూర్తి

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాలకొండ తహసీల్దార్‌గా సీహెచ్ రాధాకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఈయన బదిలీపై తహసీల్దార్‌గా ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు తహసీల్దార్‌గా పనిచేసిన బాలమురళీకృష్ణ బలిజిపేట తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

5న జాతీయ లోక్‌అదాలత్

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో జూలై 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు పాలకొండ సివిల్ జడ్జి హరిప్రియ తెలిపారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులను కక్షిదారులు ఈ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చునని, దీనివల్ల కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. న్యాయవాదులు మురళీమోహన్, గోవిందరాజులు, బి.రామ్మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

పాలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో పనిచేస్తున్న 27 మంది రిసోర్స్ పర్సన్లకు గురువారం రూ.30వేలు విలువ చేసే ట్యాబ్‌లను పంపిణీ చేశారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి, మెప్మా సీఎంవో కృష్ణారావు, టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ అందిస్తాం

జియ్యమ్మవలస, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలన్నీ అందిస్తామని, దీని కోసమే ధర్తీ అభా జన్ జాతీయ్ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ - జేబీయూఏ) పథకం ప్రవేశపెట్టారని ఎంపీడీవో కె.ధర్మారావు అన్నారు. అర్నాడ పంచాయతీ కేంద్రంలో గురువారం ఆయన గిరిజనులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధార్‌కార్డులు సరిచేయడానికి 68 దరఖాస్తులు, పీఎం జన్‌ధన్ యోజనకు 7, పింఛన్లకు 21, సికిల్‌సెల్ టెస్టింగ్‌కు 12, కుల ధ్రువీకరణ పత్రాలకు 12, రేషన్‌కార్డులకు 12, ఉపాధి హామీకి సంబంధించి 26 దరఖాస్తులు, సెల్ఫ్ పాయింట్‌కు ఒక దరఖాస్తు వచ్చాయన్నారు. వీటన్నింటిని పరిష్కరిస్తామని చెప్పారు.





